
## పండిత శ్రీరామశర్మ ఆచార్య



# కుండలినీ జాగరణ ఎందుకు?

డి.టి.పి. మఱియు ఎడిటింగ్ :   శ్రీమతి లక్కరాజు. రాజ్యలక్ష్మి

- గాయత్రి హిమగిరి పీఠము
ఫోన్ నం. 08592/23971

# అధ్యాయము - 2

## కుండలినీ జాగరణ ఎందుకు?

కుండలినీ సాధన చేయడానికి ఎవరూ ఆతృతపడవద్దు. ఏవో పుస్తకాలు చదివి, యెవరివద్దనో శిష్యరికము చేసి, కొద్దోగొప్పో నేర్చుకుని సాధన మొదలుపెట్టవద్దు. ఈ మహా ప్రయోగము యెవరికి, యెంతవరకు, యెందుకు అవసరమో వారికి తగినంతగా లభింపజేయడము నా బాధ్యత. ఈ స్థూల శరీరము వుండకపోయినా, నా సూక్ష్మశరీరముతో యింకొక 200 సంవత్సరములవరకూ నా కర్తవ్యాన్ని నిర్వహిస్తూనే వుంటాను.

ఏవిధముగా దివ్యశక్తులు నా చేత 24 సంవత్సరములు గాయత్రి మహాపురశ్చరణ చేయించి, మూడు సంవత్సరముల కఠిన తపస్సు చేయించి, దేశ మరియు విశ్వ కుండలినిని జాగృతము చేసే విధానము చెప్పడము మాత్రమేగాక, ఆయన స్వయముగా నాకు తోడునిలిచి, దగ్గఋండి చేయించి, సరంజామాగూడా సిద్ధము చేసిపెట్టినవో, నేనుకూడా అదేవిధముగా, సత్పాత్రులకు, విశేష ప్రయోజనము కోసము, విశేష ఆత్మబల సంగ్రహము చేయడానికి, కుండలినీ విజ్ఞానముయొక్క ఆశ్రయము పొందాలనుకునే వారికి, అవసరమైన వాటిని సమకూర్చి పెట్టడము జరుగుతుంది.

గురుశిష్య సంబంధము శారీరికమైనది కాదు. ఆత్మకు సంబంధించినది. సాధకుని జీవాత్మ, గురువుయొక్క ఆత్మతో సంబంధము కలిగివుంటుంది. అందువలన గురువు శరీరాన్ని త్యజించినా, యేవిధమైన అవరోధాలు లేకుండా ఆయననుండి ప్రేరణ నిరంతరము లభిస్తూనే వుంటుంది.

## 2.1 పూజ్య గురుదేవులు వేదమూర్తి, తపోనిష్ఠ, యుగద్రష్ట పండిత శ్రీరామశర్మఆచార్య సందేశము : భవిష్యత్కథనము

ఈనాడు మానవజాతిని, సృష్టిని, ప్రమాదాలలో పడవేసే విశ్వవ్యాపి వినాశకర పరిస్థితులన్నివైపుల నుండి చుట్టుముట్టాడుతున్నాయి. ఇవి యెంత వికటమైనవో, అంత సమర్థవంతమైన ప్రతినిరోధక వుపకరణాలు కావాలి. ఏనుగును చిన్న ఆయుధాలతో చంపలేము. కోటగోడను కూల్చటానికి బాణాలు చాలవు. ఫిరంగులు కావాలి. వృత్రాసురుణ్ణి చంపటానికి వజ్రాయుధమే కావాలి. మహిషుని వధకు చండి అవతరణ జరగాలి. పర్వతాన్ని పెకిలించుటకు హనుమంతుని పౌరుషము కావాలి. ఈనాటి పరిస్థితులను చూస్తే సాధారణ రచనాత్మక సామర్థ్యము సరిపోదు. సంఘర్షణకు బ్రహ్మాస్త్రములాంటి సాధనలు చాల అవసరము. నా పూర్తి జీవితము గాయత్రీమయము. మిగిలిన కాలముకూడా దానిలోనే వినియోగపడితే మంచిది. నేటి విభీషకతలతో యుద్ధము చేయటానికి ఒక చంద్రగుప్తుడు, శివాజి, వివేకానందలాంటివారు దొరికితే నా నిర్ధారిత పథములనుండి ప్రక్కకు వచ్చి, కుడి యెడమల వైపు చూడవలసి వచ్చేది కాదు. ఎంత ప్రయత్నించినా అటువంటి పరిస్థితి ఏర్పడలేదు. భౌతిక లక్ష్య సాధనలకు స్థూలశరీరధారులు కావాలి. ప్రత్యక్ష పనులకు ప్రత్యక్షశరీరాలు కావాలి. ఈ వెదకటముతోనే చాలా సమయము ఖర్చు అయినది. బీజరూపములో శక్తి వున్న ఋషిసత్తాలుమాత్రమే నాకు ప్రజ్ఞా పరివార రూపమున అందుబాటులోకి వచ్చాయి.

ప్రజ్ఞా పరివార్ పరిజనులు ఉపాసనా, సాధనా మాత్రమే చేస్తూ వ్యక్తిగత సామర్థ్యమును పెంచుకుంటున్నారు మరియు సమస్యలను తీర్చుకుంటున్నారు. వారికి యీ దిశానిర్ధారణ లేకపోతే ఇతరుల వలె సాధారణ జీవితాలను గడుపుతూ వుండేవారు. వీరి సామర్థ్యము వ్యక్తిగత, కుటుంబగత అవసరాలను తీర్చుటకే సరిపోతోంది. ఇటువంటి పరిస్థితులలో గురుదేవులు (దాదాగురుదేవులు) అతి పెద్ద పరిమాణములో శక్తిని వుపార్జనచేసి, ఆ తరువాత, దాని వితరణకూడా నేనే స్వయంగా చేయుట ఏకైక మార్గము అని నిర్దేశించారు. దానికి అనుగుణ్యంగా నా మార్గము మార్చుకున్నాను.

1984 లో యీ మార్పు చేయబడింది. ఏకాంత సాధన, సావిత్రీ సాధన అవలంబనగా తీసుకోబడినది. ఇంతవఱకు అందరితో కలిసి జీవించే జీవితవిధానాన్ని పూర్తిగా మార్చివేసుకొని యేకాంత సాధన చేయటము అంత సులభము కాదు. సావిత్రీ సాధన – పంచకోశజాగరణ సాధన, కుండలినీ జాగరణ సాధన. దీనినే సూక్ష్మీకరణ సాధన అంటారు. పంచీకరణ సాధన అని కూడా అంటారు. నన్ను గాయత్రీ సాధనలో నిలిపిన మార్గదర్శకుడే సావిత్రీ సాధనావిధానాన్ని తెలిపి నా ద్వారా అనేక ప్రసుప్త దేవమానవుల శక్తిని జాగృతము చేయటానికి, వారు, వారి వాస్తవిక స్వరూపాన్ని గుర్తించి, ఆత్మప్రగతిని సాధించడము ద్వారా సమిష్టి. గత హితమును చేకూర్చటానికి కావలసిన శక్తి సముపార్జన చేయించారు. నెలకొనివున్న భయావహ పరిస్థితులను చూసి సావిత్రీ సాధనకంటే ఒక అడుగు ముందుకు వేసి కుండలినీ జాగరణ చేయవలసి వచ్చింది.

**అంతేకాక యీ శక్తి సునియోజనము భవిష్యత్తులో ఏవ్యక్తుల ద్వారా చేయవలసి వున్నదో, వారికి యీ విధానముయొక్క సముచితమైన జ్ఞానమందించవలసిన బాధ్యతను కూడా నామీద పెట్టారు.**

కుండలినీ విజ్ఞానమును గురించి రకరకాల ప్రయోగ పరీక్షలు జరుగుతున్నవి. ఈ సందర్భములో క్రొత్త, ప్రాత పుస్తకాలలో, చిత్రవిచిత్రమైన విషయాలు చెప్పబడ్డవి. వాటిలోనే కొన్నిటిని కలిపి రచయితలు, ప్రకాశకులు కొన్ని ప్రచురణలు చేశారు. ఈ ప్రయత్నము వల్ల పేడ – బెల్లము కలిసిపోయాయి. విషయము ఆకర్షణీయమైనది. గుహ్యవిజ్ఞానమునకు సంబంధించినది కనుక అనేకులు దీనిమీద దృష్టిని సారించారు. కానీ ఎవరుకూడా వ్యక్తిగతముగా అనుభవము సంపాదించుకొనుటకు ప్రయోగాలు చేయలేదు. వారు వ్రాసినదంతా హఠయోగము యొక్క ప్రారంభిక ప్రయోగాలు, దాని ప్రతిక్రియలు మాత్రమే. అవి ఈ మహావిద్యలోని ఒక శాతముకూడా కాదు. ఆధారభూతమైన సిద్ధాంతాలను వివరించే సమగ్రమైన మార్గదర్శన మివ్వగలిగే పుస్తకము లేదు.

నేను స్వయంగా భ్రమ, జంఝాటములనుండి తప్పించుకుంటూ, వైజ్ఞానిక కుండలినీ సాధనలను అందజేసే ఒక ప్రయత్నము చేశాను. శతాబ్దాలబట్టి జీవించివున్న నా సూక్ష్మమార్గదర్శకసత్తా (దాదాగురుదేవులు) గాయత్రీ, సావిత్రీ, కుండలినీ క్షేత్రాలలో పూర్తి ఆధిపత్యము కలవారు. ఆయన నన్ను పాత్రత గల వ్యక్తిగా గుర్తించి గత 3 సంవత్సరాలలో (1984–1987) సావిత్రీ సాధన మరియు దేవాత్మ భారతదేశముయొక్క కుండలినీ జాగరణకు వినియోగించారు. దీనివల్ల లుప్తప్రాయమైన అత్యంత శక్తివంతమయిన విధానము నా ద్వారా నూతన ప్రాణము పోసుకున్నది.

## 2.2 గాయత్రీ బ్రహ్మవిద్య - సావిత్రీ భౌతికపరమైన ఆత్మవిద్య

ఇప్పుడు మనముందున్న సమస్యలు సౌమ్య సాధనలతో నిలువరింపగలిగేవి కాదు.

**కుడిచేతితో చేసిన సాధన చాలకపోవడంతో యెడమచేతితో కూడా సాధన చేయవలసి వచ్చింది.** సావిత్రి సాధనకు అడుగు ముందుకు వేయవలసి వచ్చినది.

గాయత్రీని బ్రహ్మవిద్యయనీ, ఆత్మికీ అని పిలుస్తారు. అది ఆత్మవిజ్ఞానంలో అంతర్భాగమే అయినా దానిని భౌతిక లాభాలకూ, ప్రాపంచిక సంకటములయొక్క నివారణకుగూడా వుపయోగించుకోవచ్చు. ఈవిధముగా తనయొక్క, తనవారియొక్క హితసాధన అవుతుంది.

కుండలినీశక్తి సర్వత్రా వ్యాపించివున్నది. కాని దానిని గ్రహించి విడివిడిగా వున్న తుంపులను కలపటము చేయవలసివున్నది. చండియొక్క కరాళ రూపాన్ని ప్రవహింపజేయగలిగితే అనాచారాలను నశింపజేయటానికి వుపయోగించవచ్చు. అందుకే దీన్ని అసురనికందిని అని పిలుస్తారు. ప్రయోగింపబడినప్పుడు ఆ శక్తి దానవ ఆసురీశక్తులను నాశనము చేస్తుంది. అందుకుగాను ఆ శక్తిని వశము చేసుకుని సరియైన దిశలో ప్రయోగించాలి. పొగరుబోతు గుఱ్ఱానికి కళ్ళెము వేసి యీడ్చుకు వచ్చినట్లు ప్రయత్నపూర్వకముగా ఈ శక్తిని వశము చేసుకోవాలి. ఈ శక్తియే భస్మాసురుని, మహిషాసురుని, సుందోప – సుందులను, మహాకాళిగా వశము చేసికుని నాశనము చేసింది. శుంభ – నిశుంభులు, మధు – కైటభులు మొదలగు దుర్దాంత అసురులను మర్దించినది. రాముడు, సీత మాధ్యమంగా రావణుని; శ్రీకృష్ణుడు, బలరాముని మాధ్యమంగా పూతన, కంస జరాసంధాది ఆసురీశక్తులను నాశనము చేసిందికూడా యీ శక్తిద్వారానే. అది అంతా శక్తియొక్క ఒక పక్షము మాత్రమే. అది దుష్టశక్తుల దమనము.

ఇదే శక్తి సృజనాత్మక కార్యకలాపాలలో నిమగ్నమైతే, సృష్టి సంచాలినీ శక్తిగా మారుతుంది. మహాకాలుని పరివర్తన ప్రక్రియ యీ మాధ్యమంతో సుసంపన్నము అవుతుంది. జీవనచక్రముపై (కుమ్మరిసారె వలె)

మట్టిముద్దవలె తిరుగుతున్న ఆత్మశక్తికి భిన్నభిన్న రూపాలను కల్పిస్తుంది. వస్తుతః కుండలినీ, సృష్టి సందర్భంగా సమిష్టిగాను, జీవన సందర్భముగా వ్యష్టిగాను, శక్తి సంచాలనము చేస్తుంది. కుండలినీశక్తిని ఒకవిధంగా కాస్మిక్ ఎలక్ట్రిసిటీ అనవచ్చు. అది యోగాగ్నిని జాగృతము చేసినప్పుడు వ్యక్తిని ప్రాణవంతునిగా, సమర్థునిగా, ద్రష్టగా తయారుచేస్తుంది. కఠోపనిషత్తులో యమ నచికేత సంవాదరూపంలో ఈ ప్రాణాగ్నిని గురించి చెప్పబడినది. **అది వ్యక్తి యందలి రోగమును, వృద్ధాప్యమును మృత్యువును దాటించి జీవన్ముక్తి వైపుకు నడిపిస్తుంది.** నాడీమండలముయొక్క కామపరమైన ఉత్తేజమువలన, యే శక్తి వుత్పన్నము అవుతున్నదో, అది యోగాగ్నియొక్క క్షణిక, తాత్కాలిక పరిచయము మాత్రమే. కుండలినీ చేతనాత్మకశక్తి. అది వ్యక్తియందు శక్తిని, బలాన్ని పెంపొందిస్తుంది. అతని వ్యక్తిత్వానికి కాయకల్పము చేస్తుంది.

కాస్మిక్ స్థాయిలో, సమిష్టిగత ధరాతలంలో, కుండలినీ జాగరణ ప్రక్రియ జరుగుతుంది. దాని ప్రయోజనము అరిష్టముల నివారణ, వుజ్జ్వల భవిష్యత్తు సృజించబడటము అని తెలుసుకోవాలి. కాని అటువంటి ప్రమాదకరమైన ప్రయోగానికి సత్పాత్రులు కావాలి. రైఫిల్ ప్రేల్చటానికి ముందు గట్టిగా అదిమి పట్టుకొనకపోతే, అది వెనక్కు యిచ్చే కుదుపు (recoil) వలన కాలర్‌బోన్ విరిగిపోవచ్చు. అదేవిధంగా కుండలినీ మహాశక్తిని ప్రయోగించే టప్పుడు, అది యిచ్చే వెనుక కుదుపు(recoil) ని తట్టుకోగల సాహసము, ధైర్యము లేకపోతే లాభముకోసము జరిపే ప్రయోగము హాని కలిగించవచ్చు.

రహస్యముగా వుండవలసిన విషయాలను చర్చావేదికమీదకు యెక్కించకూడదు. అందువల్లనే యీ విద్యను గుహ్యావిద్యగా భావించి, రహస్యముగా అట్టిపెట్టడము జరిగింది. తర్కవితర్కాలు యే విషయంలో జరిగినా అహంకారము కలిగినవారు దాన్ని గల్లంతు చేస్తారు. నిజమైన సాధకునిలో అనుమానాలు రేకెత్తిస్తారు. అప్పుడు యెంత శ్రద్ధగా సాధన చేయాలనుకున్నా ఫలితాలు రావు. అనుమానము అంత ప్రమాదకరమైనది. బహుశా ఈ విషయాలన్నిటిని మనస్సులో వుంచుకొని శాస్త్రకారులు వున్నత స్థాయి సాధనలను, తంత్రముతో కూడిన సాధనలను, చర్చావిషయంగా మార్చడము నిషేధించారు. ఈ సందర్భముగా సరైన మార్గదర్శకుడు, సత్పాత్రుడైన సాధకునికి, అతని పాత్రతను అనుసరించి, సాధనలు నిర్దేశించాలని తెలుపబడింది. **సాధనాక్షేత్రములో పాత్రత ఒక్కటే చాలదు. సాధకుని పరిస్థితి, ఆవశ్యకతలు కూడా గుర్తింపబడాలి.**

సావిత్రీ – కుండలినీ సాధనలు చేయడము అసిధారవ్రతమంత ప్రమాదకరమైనదిగా భావించటము వల్ల దీని జోలికి యెవరూ పోవటములేదు. అనుభవముగల శిక్షకుడు లేకపోతే ఇంజనీరు, కళాకారుడు తయారుకానట్లే; కుండలినీ సాధనలో ప్రవీణపారంగతులు లేనప్పుడు ఇక విద్యార్థులు యెక్కడ దొరుకుతారు. కుండలినీ జాగరణ, శరీరములో వున్న ప్రాణాగ్నిని ప్రజ్జ్వలింపజేయటము. ఇప్పటివఅకు దీన్ని స్వార్థ ప్రయోజనాలకోసము మాత్రమే వుపయోగించుకుంటున్నారు. జననేంద్రియ మూలములో వున్న కామశక్తిని మేరుదండము ద్వారా బ్రహ్మరంధ్రమందలి బ్రహ్మశక్తితో విలీనము చేయటానికి షట్చక్రభేదనము చెయ్యాలి. శివశక్తి సమ్మేళనమువల్ల వివిధ సిద్ధులు లభిస్తాయి. కాని యిది పాముతో ఆటలాడుకోవటము అంత జాగురుకతతో చేయాలి.

శివ – శక్తుల యిరువురి గళంలో సర్పములు పెనవేసుకొని వుంటాయి. ఇది కుండలినీయొక్క అలంకారిక వర్ణన. కుండలినీ, హఠయోగతాంత్రిక ప్రయోగముకూడా. షట్చక్రభేదనముతో వచ్చిన శక్తులతో, ప్రతికూలతను నివారించటమేకాక, సావిత్రీ సాధనతో కూడిన వున్నతస్థాయి సాధనవల్ల నూతన వాతావరణము నిర్మించే నిమిత్త కారణముకూడా వున్నది. షట్చక్రభేదనతోపాటు పంచకోశజాగరణ ప్రక్రియనుకూడా జోడిస్తే అనేక

సృజన ప్రయోజనాలకు యీ శక్తిని వుపయోగించుకోవచ్చు. ఇల్లు కట్టుకోవడానికి యిటుకలు, సున్నము, యినుము, కలప, కూలీలు అవసరము. భోజనము తయారు చేయటానికి అగ్ని, పాత్రలు, ఖాద్యవస్తువులు, వంటచేసే వారిలో మెలుకువ కూడా అవసరము. శరీర నిర్మాణము పంచతత్త్వాలతో కూడినది అని అందటికీ తెలిసినదే. చేతనయొక్క ఆవిర్భావము పంచప్రాణాలతో జరిగింది. ఆ శక్తి ప్రవాహాన్ని జీవనీశక్తి అనికూడా పిలుస్తారు. ప్రాణాగ్ని వుత్తేజనము, కుండలినీ జాగరణ, సావిత్రీ సాధన (పంచకోశసాధన) తో జతచేస్తే దాని ప్రవాహక్షేత్రము అతి విస్తృతంగా వుంటుంది.

విశ్వమంతట యెన్ని విషమ సమస్యలు గుమిగూడి వున్నాయో వూహించలేము. అణ్వాయుధాలను విస్తారంగా నిలువచేయడము, నక్షత్ర యుద్ధమనే దాపులోవున్న ప్రమాదము, నలువైపులా వ్యాపించివున్న పర్యావరణ ప్రదూషణ, ప్రకృతిలో అసంతులనము, మానసికమైన రోగాలు, అపరాధము, దోపిడి వంటి నీలిఛాయలు చూస్తుంటే, యీ ప్రయోగాన్ని (కుండలినీ సాధన, సావిత్రీ సాధన) విశాల-వ్యాపక స్థాయిలో చేయించవలసిన అవసరము కనిపిస్తున్నది. ప్రతిఫలము అంచనా వేయడానికి వీలులేనంత గొప్పది. ఇది ప్రపంచ చరిత్రలోనే ఒక నూతన అధ్యాయము.

**దైవీప్రేరణావశమున, వ్యాపక జన సమూహముతో శక్తి జాగరణ చేయటముకోసము జరిగే యీ ప్రక్రియలో కొన్ని రహస్యాలు బయటపెట్టబడినా అవి అందరికి వుపయోగకరము. విధివిధానము, పాఠకులకు కష్టము కలిగించేటంత జటిలముగా వుండదు. ఫలితార్థము తెలిస్తే చాలు. ముందుగా ఒక్కమాట చెప్పవల్సివున్నది. ఈ సాధనలో సాధకుడు స్వయముగా లాభాన్వితుడవ్వటమేకాక; అసంఖ్యాకులకు ప్రయోజనము కలిగించటము గూడా జరుగుతుంది. ప్రస్తుతము వ్యాపించియున్న వాతావరణాన్ని ఆమూలాగ్రంగా మార్పు చేసే ప్రయత్నములో భాగము పంచుకోవడము జరుగుతుంది. ఈ ప్రయోగము దేవాత్మ భారతభూమియొక్క కుండలినీ జాగరణ ద్వారా సంపన్నము చేయబడింది.**

## 2.3 నవసృజన కోసము సాధనా పరాక్రమము

సనాతన కాలములో నెలకొనివున్న పరిస్థితులను చక్కదిద్దటానికి విశ్వామిత్రుడు ఒక సమానాంతర ప్రపంచాన్ని నిర్మించడానికి, విధాతకు దీటుగా ఆ సామర్థ్యాన్ని పొందటానికి, సూర్యుని వుద్దేశించి ప్రచండమైన తపస్సు చేసినట్లు పురాణాలలో చెప్పబడివున్నది. ఆయన తన సాధన సఫలము కావడముతో తన కార్యక్రమాన్ని ప్రారంభించాడు. సమానాంతర ప్రపంచము వుత్పన్నము కావడమువల్ల దేవతలు యిక్కట్లుపడి ఆయనను ప్రార్థించి ప్రసన్నుని చేసుకుని ఆ కార్యక్రమాన్ని విరమించుకునేటట్లు చేశారు.

సమానాంతర విశ్వాన్ని నిర్మించడము క్రొత్త సంగతేమీకాదు. అది మొదటినుండి వున్నదే. అది అదృశ్యముగా, అనుభూతులకు ఆవలనున్నది. ఆ శక్తిని పొంది, ఆ సాహసము చేయడానికి పూనుకోకపోవడానికి కారణము దానివల్ల ప్రస్తుతమున్న ప్రపంచంయొక్క పరిస్థితి మారిపోయి గందరగోళం జరిగిపోతుందనే భయముమాత్రమే.

పరమాణువుకు యాంటీ-యాటం (Anti-Atom), పదార్థమునకు యాంటీ-మ్యాటర్ (Anti-Matter), విశ్వమునకు యాంటీ-యూనివర్స్ (Anti-Universe) వుంటుందని పదార్థవిజ్ఞానము అంగీకరించింది. అవి శరీరము, నీడవలే కలసివుంటాయి. అది త్రాసులోని రెండు సిబ్బెలవలె, సైకిలు కున్న రెండు చక్రాల వలె, పరస్పరము సమానము (Balance) చేసుకుంటూ వుంటాయి. కనిపించే విశ్వమంతా చిరకాలమునుండి

ఆవిధముగానే నడుస్తున్నది. చిన్నదైనా పెద్దదైనా, ప్రతీది తన శక్తి కేంద్రము చుట్టూ తిరుగుతూ, విశ్వవ్యవస్థయొక్క ఒక నిర్ధారింపబడిన క్రమములో నడుస్తూవున్నది. నీటిలో సుడిగుండము, గాలిలో సుడిగాలి, బ్రహ్మాండముయొక్క ధ్రువములో బ్లాక్‌హోల్ వంటి స్థితులు కనిపిస్తాయి. దీనికి కారణము ఒక ప్రతిచర్య, ప్రతిపక్షశక్తి, సామాన్య ప్రవాహములో నిరోధము కలుగజేస్తూ, ఆశ్చర్యకరమైన యీ దృశ్యాలను ప్రకటింపజేస్తుంది. లేకపోతే సామాన్య ప్రవాహములో యీ దృశ్యాలు కనిపించవల్సిన అగత్యము లేదు.

జలపాతములో నీరు పైనుండి క్రిందికి దూకుతూ వున్నపుడుగూడా సుడిగుండాలు కలుగుతూ వుంటాయి. అదేవిధముగా సాఫీగా వున్నదాన్ని తిరగేస్తే లెక్కలేనన్ని విచిత్రాలు జరుగుతాయి. తుఫానులో యెంత శక్తి వుంటుంది? అది పెద్దపెద్ద యిళ్ళను, ద్వీపాలను, రాతిదిబ్బల్ని పైకి యెగరేసుకుపోతుంది. నదిలో సుడిగుండాల వద్ద పెద్ద నావలుగూడా మునిగిపోతాయి. సముద్రంలో అయితే పెద్ద స్టీమర్‌లు అతలాకుతలము అయిపోతాయి. బెర్ముడా ట్రయాంగిల్ వంటి స్థలాలలో విమానాలు, ఓడలు అదృశ్యమైపోతున్నాయి.

పృథ్వియొక్క గురుత్వాకర్షణశక్తి, అయస్కాంతశక్తి, అది తిరగటమువల్ల లేక తన స్వయంశక్తివల్ల కలగటము లేదు. పృథ్వికి సమానమైన యింకొక పిండము, తిరుగుతూ వుంటుందని, వాటి రెండింటివల్ల రెండు శక్తులు వినిర్మితమవుతాయని, అవి తిరుగుతూవుంటే, అంతరిక్షమునుండి వచ్చే వికిరణము, వుల్కలు భూమిని తాకకుండా రక్షణ కలుగుతున్నదని పరిశోధనలవల్ల తేలుతున్నది.

ఈ ప్రతిద్వంద్వశక్తి నీడవలె వుంటుంది. ఆ ప్రతివిశ్వము (Anti-Universe) ముందుకు వస్తే, దృశ్యజగత్తు వెనక్కిపోతే అంతా క్రొత్తగా మారిపోతుంది. క్రొత్త పదార్థము, క్రొత్త ప్రాణులు, క్రొత్త మనుష్యులు పుట్టుకువస్తారు. నడక, స్వభావము పూర్తిగా మారిపోతాయి. ఇది సంభవమేనా అంటే, విశ్వసనీయమైన సత్యము. మనుష్యుని మించింది యేదీ లేదు. భగవంతుడు మనిషిని తయారుచేశాడు. మనిషి భగవంతుని తయారుచేశాడనేదీ సత్యమే. ఇతర ప్రాణులలో యేదీ భగవంతుని శక్తిని గ్రహించలేదు. మనుష్యుడు భగవంతునికి యువరాజు. వ్యాసమహర్షి చెప్పినట్లు విశ్వములో మనుష్యుని మించిన గొప్ప వస్తువు లేదు. అది అక్షరసత్యము. భూమి తరచుగా తన కక్ష్యను మార్చుకుంటుంది. సరియైన చోటుకి మనిషి వెళ్ళి గట్టిగా దెబ్బ వేస్తే, భూమి తన కక్ష్యను మార్చుకుంటుంది. అప్పుడు ప్రస్తుతము వున్న సంవత్సరానికి 365 రోజులూ, రోజుకు 24 గంటలూ వుండక, మార్పువస్తుంది. ఉష్ణోగ్రతకూడా మారుతుంది. ప్రకృతి అంతా మారిపోతుంది.

ఒక మనిషి స్థూలశరీరశక్తి యింత పనిచేయగలిగితే, అతని చేతన(consciousness) దానికి యెన్నో రెట్లు శక్తివంతమైనది. తన శక్తినంతా కూడగట్టుకుని అది దెబ్బ వేస్తే, స్థితిలో యెంతటి మార్పువస్తుందో చెప్పడానికి భాష చాలదు. నేటి భూమండలములో నెలకొని వున్న విపత్తులలో పరివర్తన తీసుకురావడము మాటలుకాదు. పరిస్థితులలో మార్పుతేవాలి. పరిస్థితులలో యెలా మార్పుతేవాలి? ఈ ప్రశ్నను లోతుగా విశ్లేషిస్తే  పరిస్థితుల నిర్మాత మనఃస్థితి అని తెలుస్తుంది. మనస్సు, ఆకాంక్షలవల్ల ప్రభావితమవుతుంది. ఆకాంక్షలు, పనిచేయడానికి ప్రోత్సహిస్తాయి. క్రియలు గుమిగూడితే, పరిస్థితులు తయారవుతాయి. అందువలన మనస్సే పరిస్థితుల నిర్మాత – విధాతగూడా. అందువల్ల నేటి పరిస్థితులను చక్కబరచాలంటే, ముందు మానవజాతి ఆలోచనావిధానాన్ని మార్పు చేయాలి. దానికి భౌతికమార్గములో ప్రచారము, ప్రశిక్షణలు యివ్వడము అంత వుపయోగకరము కాదు. నీతి, ధర్మము, దేశభక్తి, కర్తవ్యము, సంస్కృతి మొదలైనవాటిని ప్రచారము చేసేవారు వారి నిజజీవితములో దానికి వ్యతిరేకముగా ప్రవర్తిస్తున్నారు.

# కుండలినీ జాగరణ ఎందుకు?

ఆలోచనలలో మార్పు తేవాలంటే, కేంద్రాన్ని పట్టుకొని మార్పుచేయాలి. ఆ కేంద్రమే అంతఃకరణ. దాన్నే అంతరాత్మ అని పిలుస్తాము. మహాపురుషుల శరీరము, వారు చేసిన సాధనలలో గొప్పతనము లేదు. గొప్పతనమంతా వారి అంతఃకరణములోనే వున్నది. అది యెంతో వున్నత స్థాయిలో వుంటుంది. అంతఃకరణమును సమున్నతముచేసి, మార్చి, చక్కదిద్దగలిగితే యుగపరివర్తన జరిగితీరుతుంది.

ఒకరిద్దరిని మార్పు చేయాలంటే, ప్రలోభము చూపి, దబాయించి, పరామర్శ చేసి, కూటనీతిని వుపయోగించి మన దారికి తీసుకురావచ్చు. కానీ సుమారు1000 కోట్లమంది వ్యక్తుల భాగ్యాన్ని నిర్మించడము, అనేక భాషలు మాట్లాడే, అనేకరకాల వాతావరణములలో వుండే, అనేక పరిస్థితుల చక్రవలయములో బంధింపబడ్డ, అనేక సంస్కారాలతో కట్టబడిన, అనేక పరంపరలను అభ్యాసము చేసేవారికి సంబంధించిన ప్రశ్న యిది. వారి నమ్మకాలలో వున్నత సంస్కారాలను ఆరోపించి, ఆదర్శాలను అవలంబింపజేసే కార్యక్రమములను యెంత కష్టమైనాసరే చేయించగలగాలి.

అటువంటి గొప్ప ప్రయోజనము కోసము మానవశక్తి చాలదు. దైవీశక్తి అవసరము. అంతరాత్మలో మార్పు తీసుకురావడము అసాధారణమైన విషయము. ఇదే నిజానికి యుగపరివర్తన శిలాన్యాసము. బాహ్య వుపచారాలు, వుపాయాలు, ప్రయత్నాలవల్ల పరిస్థితులు అదుపులోనికి రావు. అంతరాత్మలో మంథనము జరిపి, పరివర్తన తీసుకురావడము యెంత కష్టమో, యెంత జటిలమో, అది వూహకు అందని విషయము. కానీ భగవంతుడు తల్చుకుంటే అసంభవము అనేది యేదీ లేదు. ఆయన కలియుగాన్ని, సత్యయుగముగా మార్చగలడు. త్రేతాయుగములో ధర్మసంస్థాపన చేశాడు. రావణుడు, వృత్రాసురుడు ఆయన చేతిలో మసైపోయారు. కుచేలుడు, విభీషణుడు, సుగ్రీవుల విపన్నతలు పోయి సంపన్నులైనారు. మానవోచితమైన విచారధారకు, మానవ వర్చస్సు యొక్క గరిమకు పునర్జీవితాన్ని ప్రసాదించడానికి అంతఃకరణలో భారీస్థాయి మార్పు తీసుకురావడము ఆయన తల్చుకుంటే అసంభవము కాదు. ఎవని పరాక్రమము వల్ల గ్రహతారకలు ఆకాశములో నియమిత రీతిలో సంచరిస్తున్నాయో తలచుకుంటే ఆశ్చర్యచకితులము కాక తప్పదు. మానవుని ఆలోచనలలో క్రాంతి తీసుకుని రావటము ఆయనకు బాలక్రీడ వంటిది.

నేటి పరిస్థితులను పట్టించుకోని వారికి సమస్యలు లేవు. వారు రాత్రంతా నిద్దురపోతారు, పగలల్లా పని చేస్తారు. అనుకూలంగా వుంటే హర్షిస్తారు. ప్రతికూలత యెదురైతే బాధపడతారు. పుట్టిన దగ్గరనుండి మరణించేవరకు, అదే యింటిలో వుంటూ, అదే బంధుమిత్రులతో మల్లగుల్లాలుపడుతూ గడుపుతారు. నేటి పరిస్థితులనుబట్టి  కొద్దిగా పూజా, పునస్కారాలు చేసినంత మాత్రాన సమాధానానికి ఆద్యంతాలు కనిపించవు. వాతావరణకాలుష్యాన్ని నివారించే దెలా? అణుయుద్ధ ప్రమాదాన్ని నిరోధించే దెలా? పెరిగిపోతున్న రేడియేషన్‌ను (వికిరణాలను) అడ్డగించే దెలా? పెరిగిపోతున్న జనసంఖ్యను అరికట్టే దెలా? జనాభా పెరుగుదల వలన విశ్వమంతా సర్వనాశనము కావటానికి దారితీస్తున్నదని స్త్రీ పురుషులకు తెలియజెప్పే దెలా? దానివల్ల అన్నపానాలకు కరువు వస్తుందని వారికి తెలిపే దెలా? జనాభాకు తగ్గట్లుగా ఖనిజసంపద యేది? ఎక్కడ వెదికి తేవాలి? అన్నము యెలా పెట్టాలి? జీవితము జీవించే కళను నేర్పే అధ్యాపకులేరి? సమాజము పట్ల కర్తవ్యనిరతిని పెంపొందించే దెలా? మందులతో కాకుండా ప్రకృతి నియమాలను అనుసరించి రోగాలను తనంతట తానే నయము చేసుకుని ఆరోగ్యాన్ని పెంపొందించుకునే దెలా? అలా చేసే వైద్యశాల లేవి? అటువంటి సమాజ వ్యవస్థను యెవరు తయారుచేస్తారు? అందరూ కలిసి బ్రతికే రోజు యెప్పుడొస్తుంది?

# కుండలినీ జాగరణ ఎందుకు?

ఈ తల్లక్రిందుల ప్రపంచాన్ని సరిగా నిలబెట్టడానికి మానవశక్తి చాలదు. దైవశక్తి కావాలి. దీన్ని యేవిధముగా జాగృతము చేసి, యేకీకృతము చెయ్యాలి? దాన్ని భూలోకవాసులకు యెలా అందించాలి? ఇది చాలా క్లిష్ట సమస్య. అన్నిటికన్నా పెద్ద సమస్య సమర్ధులైనవారి ఆలోచనాధోరణి దిశ మార్చటము. ధనవంతులుగానీ, పరిపాలకులుగానీ అందరూ పెడత్రోవనే పట్టివున్నారు. దేశశ్రేయస్సునుగురించి కబుర్లు చెప్పేవారేగానీ, ఆచరించేవారు లేరు. స్వార్ధము వదిలి పరమార్ధము కోసము ప్రాకులాడేవారే లేరు. వీరందరూ విధ్వంసము చేయడములో తమకున్న సామర్ధ్యాన్ని, నవసృజన కోసము ప్రయత్నిస్తే, స్వార్ధము వదిలి పరమార్ధము కోసము ప్రయత్నిస్తే ప్రపంచ వాతావరణములో శాంతి, సౌఖ్యాలు నాట్యమాడతాయి. యుగపరివర్తన జరిగితీరుతుంది.

ఆధ్యాత్మవిజ్ఞానము దీనికి ఒకే ఒక మార్గము తెలుపుతుంది. అతి కఠోర తపశ్చర్య. తపోబలముతోనే బ్రహ్మ సృష్టిని చేయగలిగాడు. భగీరథుడు దివి నుండి గంగను భువికి దింపగలిగాడు. వృత్తాసురుని దుండగాలను సహించలేక దేవతలు పాహి–పాహి అని ఆక్రందనలు చేస్తుంటే, వారి ప్రాణాలను కాపాడటానికి దధీచి మహర్షి తన ప్రాణాలను త్యాగము చేసి తపస్సు వల్ల అపరిమిత శక్తివంతమైన తన వెన్నుముకను దానము చేస్తే, దాన్ని వజ్రాయుధముగా తయారుచేసి ఇంద్రుడు వృత్తాసుర సంహారము చేయగలిగాడు. పరశురాముడు తపోబలముతో 21 సార్లు ధరామండలములో అనాచారాలపై దండెత్తి వాటిని నాశనము చేయగలిగాడు. దయానందమహర్షి తన పాఖండ ఖండినీ ధ్వజముతో సమకాలీనుల కపట నాటకాల ఆట కట్టించాడు.

నేడు పరివర్తన జరగాలంటే, తపశ్చర్య వల్లనే సాధ్యము. బలిష్టమయిన వ్యక్తిత్వము, సంకల్పశక్తి, క్రియాశక్తి సమన్వయముతో, కోరికలు నెరవేరు పరిస్థితులను ఆకర్షించి, దగ్గరకు లాక్కోవడము సహజము. మానవీయశక్తి కన్న అనేక రకాలుగా కుండలినీశక్తి చాల గొప్పది. అది జననేంద్రియ మూలమైన, మూలాధారములో నివసిస్తూ, దాని ధారణశక్తి వల్లనే వంశవృద్ధిని చేస్తూవుంటుంది. ఆ మహత్తర కామశక్తి ఫలితము, క్రియాశక్తియొక్క అతి చిన్న బిందువు, నూతన మానవుని సృష్టించి, శక్తినివ్వగలగడము ఆశ్చర్యకరమైన విషయము. భౌతికమైన యీ ఒక్క ప్రయోజనముకొరకే నేడు కామశక్తిని వుపయోగించుకోగలుగుతున్నాము. నేడు కామశక్తిని యెక్కువగా దురుపయోగము చేసుకుంటున్నాము.

ఏనాడు యీ శక్తి, సాధన ద్వారా బ్రహ్మాండవ్యాప్తము చేయబడుతుందో, ఆనాడు గణింపనలవికాని మార్పు మనుష్యుల మనఃస్థితిలో వస్తుంది. యుగాన్నీ మారుస్తుంది. విశ్వామిత్రుని మాదిరిగా నూతన సృష్టిచేస్తుంది. కుండలినీ ప్రాణవిద్యుత్తు, మనుష్యుల జీన్సు, గుణాన్నే మార్చి వాటిలో మార్పులు తీసుకురాగలదని యితిహాసాలు ఋజువు చేస్తున్నాయి. పులస్త్యబ్రహ్మయంతటివాని కుమారులందరూ రావణపరివారముగా దైత్యులైనారు. వాలఖిల్యమహర్షి రాక్షస దంపతులకు జన్మించినప్పటికి, పుట్టిన వాతావరణాన్ని విడిచి మఱ్ఱిపాలు త్రాగి, పెరిగి పెద్దవాడై ఋషిప్రకృతిని పొందగలిగాడు. త్రేతాయుగములో ఋష్యమూకపర్వతము వద్ద నివసించే వానరులందరూ వారికి గల పశుప్రవృత్తిని వదిలి, శ్రేష్ఠులైన మనుష్యులవలె ఆలోచించి, ప్రవర్తించే స్థితికి రాగలిగారు. అటువంటి సంఘటనలు ప్రాణశక్తియొక్క విశిష్ఠ సామర్ధ్యము వల్ల యెలా జరిగాయో అటువంటి సంఘటనల వల్లనే యుగపరివర్తన అనేది సాధ్యపడుతుందనే విశ్వాసము కలుగుతుంది. ఈశ్వరుడు ప్రాణులను సృష్టిచేశాడు. దానితోపాటు తన యువరాజైన మనుష్యునిలో కుండలినీశక్తి రూపములో ఒక విలక్షణమైన శక్తి భాండాగారాన్ని నింపాడు. అది వ్యక్తి విశేషములో మాత్రమేగాక, సమిష్టిగత, సామూహిక ప్రకృతిలో గూడా ఆశాతీతమైన పరివర్తన తీసుకురాగలదు.

దేవాత్మయైన భారతభూమియొక్క కుండలినీ జాగరణ సాధన మొదట్లో ఒకే వ్యక్తి నడుముకట్టి పూర్తి చేసినప్పటికిన్నీ, అందరికి దానిలో భాగస్వామ్యమున్నది. ఈ శక్తి జాగరణ వల్ల యుగపరివర్తన సంభవము.

## 2.4 భారతవర్ష కుండలినీజాగరణ ప్రక్రియ

సవితయొక్క సూక్ష్మ కుండలినీ శక్తి అంతటా వ్యాపించి వున్నప్పటికి అనుష్ఠానమూ, ఆహ్వానమూ చేసేచోట మాత్రమే దాని అభివ్యక్తి ప్రకటితమవుతుంది. సవితయొక్క మహాశక్తి సామాన్య స్థూల వినియోగము మనము వేడి, వెలుగుగా అనుభవిస్తున్నాము. సవితయొక్క అసామాన్య, సూక్ష్మశక్తి వినియోగము జీవననిర్మాణము రూపములో వున్నది. బ్రహ్మాండమంతటా వ్యాపించియున్న సవితాశక్తి బీజరూపములో మానవ శరీరములో నిక్షిప్తమై వున్నది. ఏడు చక్రాలు, ఏడు ధాతువులు, ఏడు భువనాలు, ఏడు అశ్వములు, ఏడు శక్తి ప్రవాహాలు, సూర్యుని ఏడు రంగులుగా యీ మహాశక్తి వ్యక్తమవుతుంది. వీటి సహాయముతో సృష్టియొక్క వుత్పాదన, అభివర్ధన, పరివర్తనాక్రమము నడుస్తున్నది.

సాధనలద్వారా వ్యక్తిలో కుండలినీ జాగరణ జరుగుతుంది. అతడు తన మనోబలము, ప్రాణబలముల సహాయముతో దానిని సాధించగలడు. మానవ శరీరములో దాగియున్న అగణిత బీజములు వికసితము కావడముతో అతనిలో అసాధారణమైన శక్తి వికసిస్తుంది. అటువంటివారిని సిద్ధపురుషులనీ, మహామానవులనీ, తేజోపుంజములనీ పిలుస్తాము. వారు శాపాన్ని, వరదానాన్ని యివ్వగలరు. సృజనము, నాశనము రెండూ చేయగలరు. వారు చేసేది అద్భుతముగా, ఆశ్చర్యజనకముగా, అలౌకికముగా వుంటుంది. ఇది వ్యక్తిగత సాధనా సాఫల్యము. మామూలుగా మనిషి స్వార్థముతో నిండివుంటాడు. అతడు తన వైభవము, విలాసాలు, పరాక్రమము, కీర్తి, ప్రతిష్ఠలగురించి మాత్రమే ఆలోచిస్తాడు. స్వర్గము, ముక్తికూడా స్వార్థములో భాగమే. శాప, వరదానాలు యివ్వడముతో ఆత్మతృప్తి కలుగుతుంది. ఈవిధముగా కుండలినీ జాగరణ వ్యక్తిగత ప్రయోజనాలకు వుపయోగింపబడుతుంది.

సమిష్టి జాగరణ, ఆత్మికీ సంబంధమైన ఒక వున్నతశ్రేణికి చెందిన ప్రయోగము. ఇందులో సాధకుడు 'తన' అనే పరిమితిని దాటిపోతాడు. అతడు యేది ఆలోచించినా, యేమిచేసినా అందులో విశ్వవ్యవస్థను సమున్నతము, శ్రేష్ఠము చేయాలి అనే యేకైక లక్ష్యము కనిపిస్తుంది. అతడు ఆత్మవత్సర్వభూతేషు, వసుధైకకుటుంబకము అనే ఆదర్శాలను కలిగివుంటాడు. అతని కోరికలూ, కార్యక్రమాలు, విశ్వకళ్యాణము కొరకే. తనదనేది యేదీ వుండదు. ద్వైతాన్ని అద్వైతములో విసర్జిస్తాడు. తుచ్ఛతను మహత్తులో కలిపివేస్తాడు. కామనను భావనగా మార్చుకుంటాడు. తన చింతన, కర్తవ్యములను విరాట్పురుషునికి సమర్పిస్తాడు. అతని అభిరుచి విశ్వవాటికలో పూలుపూయించి, పండ్లు పండించటములో నిమగ్నమై వుంటుంది.

దేవర్షి నారదుడు వైకుంఠమునకు పోయి, విష్ణుమూర్తిని ఒకే ఒక ప్రశ్న అడుగుతూవుంటాడు. విశ్వముయొక్క అస్తవ్యస్థ పరిస్థితిని చక్కదిద్దగలిగే దెలాగని? ఋషుల ఆకాంక్ష యెప్పుడూ ఒక్కటే. **'కామయే దుఃఖతప్తానాం ప్రాణినాం ఆర్తి నాశనం'**. దుఃఖములో కాలిపోతున్న ప్రాణుల ఆర్తి యేవిధముగా పోగొట్టాలి అని. ఉదారమైన చిత్తముగలవారి యోగము, తపస్సు అంతా యీ ప్రయోజనముకోసమే. ఈనాడు మనుష్యులు సిద్ధక్షేత్రాలకు వారి వ్యక్తిగతమైన, స్వార్థపరమైన కోరికలు తీర్చుకొనుటకు మాత్రమే వెళ్తున్నారు. సామూహిక ఆధ్యాత్మిక సాధనల పూర్ణాహుతి చేసుకొనుటకు తీర్థస్థలాలకు వెళ్ళటములేదు. వాస్తవానికి ప్రతి సిద్ధక్షేత్రము దానికి

సంబంధించిన విశేష సాధన చేసే సాధకులు పూర్ణాహుతికొరకు వచ్చే క్షేత్రమని పూర్తిగా మరచిపోయారు. సాధన అనే పేరుకూడా క్షేత్రాలలో వినిపించటములేదు. అందరూ అటువంటివారు కాదు. పరమార్థము, లోకకళ్యాణము అనేవి యిప్పటికీ అక్కడక్కడా జీవించేవున్నాయి. ఈనాడుగూడా వాటి సనాతన అస్తిత్వాన్ని చాటుతూనేవున్నాయి.

గత మూడు సంవత్సరాల కాలములో (1985-87) శాంతికుంజ్ (సప్తసరోవర్, హరిద్వార్) లో పరిస్థితుల్ని గమనిస్తే విశ్వము మరియు భారతదేశముయొక్క కుండలినీ జాగరణ అనే విశిష్ఠ సాధన జరుగుతున్నట్లు తెలుస్తుంది. అగ్నియొక్క తేజస్సు, సమీపములో యెక్కువగా అనుభవమవుతుంది. దూరము యెక్కువయ్యేకొద్దీ వేడి తగ్గిపోతుంది. ఈవిధముగానే హిమాలయాలలోని ఋషివూర్జను తిరిగి జాగృతము చేసే ప్రక్రియ హరిద్వార్‌లోని సప్తధారా క్షేత్రములో నిర్వహించబడుచున్నది.

కుండలినీ జాగరణ తపఃప్రభావము ముందు భారతదేశములో అధికముగా కనబడుతుంది. దూరము పెరగటమువలన ప్రపంచములోని యితర దేశాలలో కొంచెము ఆలస్యముగా దీని ప్రభావము కనిపిస్తుంది. అరుణోదయ కిరణాలు ముందు సముద్రములోను తరువాత పర్వతశిఖరాలపైన, చెట్ల కొమ్మలమీద దర్శన మిస్తాయి. తరువాత ప్రకాశము క్రమక్రమముగా అధికముగా వ్యాపిస్తుంది. ఆకాశమంతటా నిండుతుంది. పర్వతశిఖరాలనుండి క్రిందికి దూకుతుంది. భూమి అంతటా విస్తరిస్తుంది. సరిగ్గా అదే విధముగా గాయత్రీ, సావిత్రీ మహాప్రజ్ఞ జాలువారి యీ మూడు సంవత్సరాలు విశ్వకుండలినీని జాగృతము చేసింది. దాని ప్రకాశము ముందుగా యీ దేవభూమిమీద వుదయిస్తుంది. నిదానముగా విశ్వమంతటా వ్యాపిస్తుంది. దాని ప్రభావమువలన జరిగే మార్పులు విభిన్న క్షేత్రాలలో విభిన్న రీతులలో దృష్టిగోచరము కానున్నది.

**ఇది సంభావన కాదు. నిశ్చయముగా యిది జరుగుతున్న, జరగబోయే తథ్యము.**

దేశము మరియు సమస్త విశ్వముయొక్క కుండలినీ జాగరణ, పూర్వకాలములో విశ్వామిత్రునిచేత సుసంపన్నము చేయబడింది. అప్పుడుకూడా వసుంధరకు కాయకల్పము జరిగింది. ఇప్పుడుకూడా అదే జరుగుతున్నది. ప్రభుత్వమువారు యెంతో ధనము ఖర్చుచేసి గంగాజలమును పరిశుద్ధము చేస్తున్నారు. ఇదేవిధముగా వ్యక్తుల మానసగంగకూడా శుద్ధి చేయబడుతుంది. క్రొత్తనీరు నింపబడుతుంది. విశ్వ-వాతావరణములో వ్యాపించివున్న అవాంఛనీయ ధోరణుల పరిమార్జనము చేయబడే సమయము ఇదే. ప్రస్తుతము జరిగే కుండలినీ జాగరణయొక్క ప్రయోజనము వ్యక్తికోసము కాదు. విశ్వముయొక్క ఆదర్శ అభ్యుదయానికి ప్రాతిపదిక చేయబడుచున్నది. అవినీతి, మూఢాచారములు, అంధవిశ్వాసములు, అవాంఛనీయ ధోరణులు అరికట్టబడతాయి.

పరివర్తనక్రమము మొదట తీవ్రముగా వ్యాపించివున్న జడత్వాన్ని తొలగిస్తుంది. అందువల్ల ముందు పరిస్థితి అల్లకల్లోలమవుతుంది. కొన్ని కష్టాలు తప్పవు. పిల్లవాడిని యెత్తుకోవాలంటే తల్లి ముందు ప్రసవవేదన అనుభవించక తప్పదు. ప్రసవానంతరము అంతటా రక్తము దుర్వాసన వుంటుంది. దానిని తుడిచి బాగుచేసి ధూపము వేయాలి. కురుపును తీసివేయాలంటే శస్త్రచికిత్స చెయ్యాలి. అప్పుడు లోపలి చీము బయటికి వస్తుంది. హోమియోపతిమందు వాడినప్పుడు ముందు లోపల అణిగివున్న వ్యాధి లక్షణాలు బయటికొస్తాయి. తరువాతమాత్రమే రోగము పూర్తిగా తగ్గుతుంది. పక్కా యిల్లు కట్టాలంటే ముందు పునాదులు త్రవ్వాలి. వస్త్రమునకు రంగు వెయ్యాలంటే దాన్ని ముందు శుభ్రముగా వుతకాలి. అదేవిధమైన పరిస్థితులను దేశకుండలినీ,

విశ్వకుండలినీ జాగృతమయ్యేటప్పుడు యెదుర్కోవాలి. వికారాలు, విద్వేషము, వంచన, అనాచారము, దురాలోచన, విద్రోహము పెచ్చుపెరిగిపోతాయి. వాటిని బయటికి నెట్టివేయకపోతే బాగుచేయడము కుదరదు. నవనిర్మాణానికి శంఖుస్థాపన చేయడానికి వీలు కలుగదు. ఇది కుండలు చేసేముందు కుమ్మరి మట్టిని నీటితో తడిపి, పిసికి, కాళ్ళతో త్రొక్కి, పదునుచేయడము వంటిది. మట్టితో కుండలు తయారుచేసిన తరువాత వాటిని ఆవంలో వేసి బాగా కాల్చాలి. నవయుగనిర్మాణములో యిదేవిధమైన ప్రక్రియ, పరివర్తన, విధివ్యవస్థ ద్వారా చేయబడుతుంది. ఇప్పుడు జరుగుతున్న వుపద్రవములను చూచి భయపడవలసిన అవసరము లేదు.

వైద్యులు అమూల్యమైన ఔషధాలను తయారుచేసేటప్పుడు మూలికల రసాలు తీసి, యితర ద్రవాలను కలిపి అగ్నిలో పుఠము పెడతారు. వృక్షము పెరగటానికి ముందు విత్తనముకూడా ప్రసవవేదన పడుతుంది. తరువాత మొలకెత్తి, మహావృక్షమై, పుష్పించి, ఫలిస్తుంది. ప్రస్తుతము నెలకొనివున్న ప్రపంచ వ్యవస్థను నూతన మూసను వుపయోగించి మార్చాలి. ఈనాడు జరుగుతున్న నూతన కాయకల్ప చికిత్సను గమనిస్తే మానవగరిమ, విశ్వముయొక్క సుసంస్కృతి సమృద్ధిగా దృష్టిగోచరము అవుతుంది.

వర్షాకాలములో మొదట్లో యెక్కడ చూచినా బురదగా వుంటుంది. గాలివానల వల్ల పూరిపాకల కప్పులు పైకెగిరిపోతాయి. ఇళ్ళు కూలిపోతాయి. కానీ కొన్ని దినాలలో యెండిపోయిన చెరువులన్నీ నీటితో నిండుతాయి. మరుభూములలో చైతన్యము కలిగి యెక్కడ చూచినా పైరుపచ్చదనము కనిపిస్తుంది. 21వ శతాబ్దములో సృజన, అభ్యుదయ వికాసము అతివేగముగా జరగడము దృష్టిగోచరమవుతుంది. గాలివాన కురిసి వెలసిన తరువాత నెలకొనే ప్రశాంతతవలె తరువాత అంతా శాంతి సౌఖ్యాలే కనపడతాయి.

## 2.5 రానున్నమార్పులు - భవిష్యత్కథనము

**ప్రపంచములో మనుగడ సాగించే మనిషి కర్మ చేస్తాడు. దానికి ప్రతిక్రియ, పరిణతి తర్వాత కనిపిస్తుంది. దేవతల విధానము యిందుకు భిన్నముగా వుంటుంది. అందులో ముందుగా వాతావరణము తయారవుతుంది. దానినుండి వ్యక్తుల ప్రాణాలు ప్రభావితము కావడము జరుగుతుంది.** ఋతుచక్రము అటువంటిదే. చలి, వేడి, వర్షము తమతమ కాలాలలో వాతావరణమును తగువిధముగా తయారుచేస్తాయి. శిశిరములో చెట్లు ఆకులను రాలుస్తాయి. వసంతములో క్రొత్త చిగుళ్ళు తొడుగుతాయి.

**యుగపరివర్తనకూడా ఋతుపరివర్తన వలె దైవీ కార్యమేకానీ మానుషీ ప్రక్రియ కాదు. దీనికి అదృశ్య వాతావరణము ప్రధాన భూమికను నిర్వర్తిస్తుంది.**

దేశముయొక్క, విశ్వముయొక్క కుండలినీజాగరణ జాగృతమయ్యేటప్పుడు జడపదార్థాలు, జీవపదార్థాలు, మనుష్యులు, పరిస్థితులు అన్నీ ప్రభావితమౌతాయి. భూమిలో సారము పెరుగుతుంది. ఖనిజాలు యెక్కువగా వెలికితీయబడతాయి, పుష్కలముగా దొరుకుతాయి. అవసరమైనదానికంటే యెక్కువగా ధాతువులు లభిస్తాయి. ఖనిజతైలాలకు లోటు వుండదు. రసాయనాలు విశేషముగా దొరుకుతాయి. వృక్ష, వనస్పతుల పెంపకానికి మనిషి పెద్దగా శ్రమపడవలసిన అవసరము వుండదు. ప్రకృతి సహకారముతోటే అవన్నీ పెరిగి పెద్దవవుతాయి. జలాశయాలలో నీటికి లోటుండదు. వనౌషధులు ప్రాచీనకాలములో వలె శక్తివంతమవుతాయి. చికిత్సకు ఖర్చు వుండదు. ఉపయోగకరమైన వృక్షముల సంఖ్య పెరిగి దీర్ఘకాలము జీవిస్తాయి. హానికారక ప్రాణుల వంశవృద్ధి నిరోధించబడుతుంది. అవి యెక్కడో అరుదుగా కనిపిస్తాయి. జల, వాయు, వాతావరణములలో

పోషకశక్తి పెరుగుతుంది. కాలుష్యము నిరోధించబడుతుంది. మాలిన్యము నశించి పరిశుభ్రత పెరుగుతుంది. ప్రకృతి వైపరిత్యాలు యెక్కడో కదాచిత్తుగా కనిపిస్తాయి. ప్రకృతి అనుకూలించడమువలన వరదలు, కరువుకాటకాలు, అకాలవర్షాలు, అంటువ్యాధులు, అగ్నిపర్వత ప్రజ్వలన విస్ఫోటములు యెక్కడా కనిపించవు.

మనిషి ఆకృతి యిప్పటి మాదిరిగానే వుంటుంది. కానీ రానున్న శతాబ్దిలో అతని ప్రకృతిలో అసాధారణమైన మార్పొస్తుంది. దుర్వ్యసనాలు యెవరికీ నచ్చవు. దొంగతనాలు, దోపిడీలు, దౌర్జన్యములు, మోసములు మొదలగునవి యెక్కడా కనిపించవు. వాటి అవసరముకూడా వుండదు. గుణకర్మ స్వభావాలలో మంచితనము పెరుగుతుంది. ప్రజల ఆత్మవిశ్వాసము పెరిగి, స్వావలంబన కలిగి, పురుషార్థపరాయణులుగా వుంటారు. దరిద్రము, అభావము వుండదు. మనిషిలో శ్రమశీలత, బుద్ధిచాతుర్యము, పని ప్రారంభించేటప్పుడే వుచితానుచితాలు ఆలోచించడము జరుగుతుంది. వనరులు యెక్కువగా వుండటమువల్ల లోటు అనేది వుండదు. ఔదార్యము పెరిగి అందరిలోను కష్టసుఖాలలో పాలుపంచుకునే ప్రకృతి పెరుగుతుంది. క్రోధము, ఆవేశము, ప్రతీకారము మచ్చుకు కూడా కనిపించవు.

వ్యక్తిగత స్వార్థము, సామూహిక స్వార్థముగా మారి, సామ్రాజ్యవాదము, దోపిడీ, దురాక్రమణలు, జాతి వైషమ్యాలు, హత్యలు, మానభంగాలు నేటి సమాజములో పెచ్చుపెరిగిపోయి వున్నాయి. అందువల్ల యుద్ధాలు, బహుళ సంఖ్యలో జననాశనము సంభవిస్తున్నాయి. యుద్ధములవల్ల యిరుపక్షాలూ నష్టపోతున్నాయి, బలహీనమైపోతున్నాయి. స్థితిగతులు యిదేవిధముగావుంటే మానవజాతి మనుగడయే కష్టసాధ్యము కాగలదు. యుద్ధోన్మాదము ఆత్మహత్యా సదృశ్యము. వివేకము వుదయిస్తే, చిన్నచిన్న తగాదాలకు, పంచాయితీ జరిపి, అక్కడికక్కడే పరిష్కరిస్తే, చిలికిచిలికి గాలివానగా మారకుండా, యుద్ధాలు రాకుండా నివారించుకోవచ్చు.

మానవునిలో వున్న సద్గుణాలు, శ్రమశీలత, తెలివితేటలు సృజన ప్రయోజనాలకు వుపయోగించుకుంటే యెన్నో సాధనాలను, సౌకర్యాలను యేర్పాటు చేసుకోవచ్చు. మనిషి దేవతలవలె, ప్రసన్నత, సుసంస్కారము, సర్వాంగసౌందర్యము పొందవచ్చు. సన్మార్గగాములైన మనుష్యులతో యీ ధరిత్రి నిండితే అది స్వర్గతుల్యము కాక మానదు. సమృద్ధి, సుసంపన్నత యెక్కడ చూచినా కనిపిస్తుంది.

రానున్న రోజుల్లో యీవిధమైన పరిస్థితులు యేర్పడతాయి. అందుకుగాను, అదృశ్యభూమిక నా యేకాంత సాధనవల్ల సంపన్నమయింది. నేను గత 3 సంవత్సరాల కాలములో (1984–87) కఠిన తపశ్చర్యల ద్వారా, విశ్వకుండలినీ జాగరణను చేయగలిగాను. మారిన పరిస్థితులలో, ముందుకాలము, రామరాజ్యానికి సాటిగా, దీటుగా చిరకాలము సుఖ – సంతోషాలతో, సమృద్ధిగా వుంటుంది. దానికి 'మళ్ళీ వస్తున్న సత్యయుగము' అని పేరు పెట్టడము వుచితమేగదా!

## 2.6 కుండలినీ సాధనయొక్క మర్మము - అవసరమైన మార్గదర్శనము

ప్రతి పదార్థానికి, ఒక కనిపించే రూపము, ఒక కనిపించని రూపము వుంటుంది. బంగారము ఒక ఖరీదైన లోహము. అది మట్టితో కలిసి భూమిలో ఖనిజరూపములో దొరుకుతుంది. దానిని శుద్ధి చేసి మార్కెట్టులో అమ్మితే, దానితో సుందరమైన ఆభరణాలను తయారుచేయించుకోవచ్చు. దానిని రసాయనాలతో కలిపి పుటముపెట్టి కాలిస్తే స్వర్ణభస్మముగా మారుతుంది. దానిలో అద్భుతమైన గుణాలు వుంటాయి. అది సేవిస్తే బలహీనులకు బలము, ధాతుపుష్టి కలుగుతుంది. దీర్ఘాయుర్దాయము కలుగుతుంది. ఇతర లోహాలలో

వాటివాటి గుణవిశేషాలు వున్నాయి. వాటి రస, భస్మాలలో గొప్ప ఆయుర్వేద లక్షణాలు వున్నాయి. పరమాణువుల సూక్ష్మాంశతో, అణుశక్తి వుత్పాదన చేయబడుతుంది. దానితో వివిధ వికిరణ కిరణాలు (Radiations) వస్తాయి. అణుశక్తితో అనేకరకాల ఆయుధాలను తయారుచేయవచ్చును. విద్యుచ్ఛక్తి వుత్పాదనకు, యితర అనేక వుపయోగకరమైన క్రియాకలాపాలకు దీనిని వుపయోగించుకోవచ్చు.

స్థూలపదార్థముతో పోలిస్తే, సూక్ష్మపదార్థము యెన్నో రెట్లు శక్తివంతమైనదన్న విషయము అందరికీ తెలిసిందే. నీటితో పోలిస్తే ఆవిరియొక్క శక్తి యెన్నో రెట్లు అధికముగా వుంటుంది. మానవీయశక్తియొక్క సూక్ష్మీకరణ కూడా యిదేవిధముగా యోగముతో, తపస్సుతో జరుగుతుంది. తపస్వి తన శరీరములో వున్న దివ్యసామర్థ్యాన్ని జాగృతము చేస్తాడు. ఆవిరితో రైలు నడుస్తుంది. ఎండుకొమ్మల రాపిడితో దావానలము పుడుతుంది. తపస్సుయొక్క సాధనాత్మక విధివ్యవస్థతో అట్టి ప్రభావము కలుగుతుంది. భూతద్దముమీద చెల్లాచెదురుగా వున్న సూర్యకిరణాలు పడి ఒక బిందువువద్ద కేంద్రీకృతమైనప్పుడు అగ్ని పుడుతుంది. తపశ్చర్యకు ప్రతిఫలముకూడా యీవిధముగానే వుంటుంది. ఆత్మశక్తి అందరిలో వున్నా, అది వికసిస్తే మహాపురుషులు, ఋషులు, దేవాత్మలు, అవతారాల రూపములో అవతరిస్తుంది.

యోగసాధనవల్ల మనుష్యునిలో అల్పత్వము, దివ్యలోకముల మహత్వముతో కలిసి, లఘుమహత్వముల యేకీకరణ జరుగుతుంది. విద్యుత్తుతో కలుపబడ్డ ప్రతి తీగ శక్తివంతమై, ఆ శక్తితో తమ పనినిచేస్తాయి. రిజర్వాయరుతో కలుపబడ్డ గొట్టాలన్నింటిలో నీరు ప్రవహిస్తుంది. కుళాయిలన్నీ నీటినిస్తాయి. దానితో కలుపబడ్డ గొట్టాలన్నీ అడ్డము లేకపోతే, యెంత దూరానికైనా నీటిని తీసుకుపోయి సరఫరా చేస్తాయి. పరబ్రహ్మయొక్క దివ్యచేతనతో మానవీ అంశ జోడించబడితే, నరుడు నారాయణుడుగా, పురుషుడు పురుషోత్తముడుగా, అల్పుడు మహాత్ముడుగా మారుతాడు. కళేబరముయొక్క విస్తరణతో, సామర్థ్యముకూడా పెరుగుతుంది. సింహముతో పోలిస్తే యేనుగు ఆకారములోనే కాక, బలములోకూడా గొప్పదే. చిన్నపిల్లవానితో పోలిస్తే యువకుని ఆకారమేగాక, పనిచేసే సామర్థ్యము కూడా హెచ్చుగా వుంటుంది. సాధకుని సిద్ధి యిటువంటిదే. ఆత్మసంయమము, సచ్ఛీలము, ప్రవర్తనలో ఔదార్యము, సేవాసాధనల సమన్వయమువల్లనే సాధన ఫలిస్తుంది. ఎరువు, నీరు, కాపలాదారు వుంటేనే విత్తనము చెట్టుగా పెరిగి పెద్దది అవుతుంది.

కుండలినీ జాగరణ అంటే, చేతనయొక్క అంతరాళాలలో దాగి వున్న దివ్యశక్తుల జాగరణ, ప్రచండీకరణ. అది మూడు శరీరాలలో విభిన్న ప్రయోజనాలకోసము వివిధ విభూతులను సిద్ధింపజేస్తుంది. ఈ విభూతులు, క్షీరసముద్ర మంథనంతో ఆవిర్భవించిన 14 రత్నాలతో పోల్చబడ్డాయి. వీటి వర్గీకరణ యీవిధంగా వుంటుంది.

### 2.6.1 స్థూలశరీర స్థిత కుండలినీ జాగరణ

ఇది షట్చక్రాల ఆధారంగా జరుగుతుంది. స్థూలశరీరంలో మూలాధారము నుండి మేరుదండములో సహస్రారకమలము లేక బ్రహ్మరంధ్రమువరకు దేవయానమార్గము వున్నది. దారిలోని మజిలీలు చక్రాలు. ఇవి శక్తివంతమైన కేంద్రాలుగా చెప్పబడ్డాయి. వీటి సిద్ధివల్ల మనుష్యుడు శక్తివంతుడై, సమృద్ధికలిగి, ప్రచండ పరాక్రమాన్ని పొందుతాడు. దీనివల్ల సామాన్య మానవునితో పోలిస్తే సాధకుడు యెంతో శక్తివంతుడుగా మారుతాడు. మన యింద్రియాలు బహిర్ముఖంగానే కాకుండా అంతర్ముఖముగాకూడా యెన్నో పనులు చేస్తుంటాయి. చర్మచక్షువులతో చూడలేని వాటిని దివ్యచక్షువుల జాగరణతో చూడవచ్చు. ఇదే అన్ని

యింద్రియాలకూ వర్తిస్తుంది. దూరదృష్టి, దూరశ్రవణము, ఆలోచనలు పంపడము, పదార్థసంచాలన, ప్రాణప్రవాహము, శక్తిపాతము, భవిష్యజ్ఞానము వంటి స్థూలజగత్తుకు సంబంధించిన సిద్ధులు లభిస్తాయి.

### 2.6.2 సూక్ష్మశరీర స్థిత కుండలినీజాగరణ

ఇది పంచకోశాల ఆధారముతో జరుగుతుంది. అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశములు చేతనకుగల ఐదు ఆవరణలు. అందులో పంచతత్త్వాలు, పంచప్రాణాలు వుంటాయి. వీటినే పంచలోకాలు, పంచఆయామాలని అంటారు. వీటి సామర్థ్యమును వికసితము చేసుకోవటములో సాధకుడు అదృశ్యజగత్తుతో సంబంధము యేర్పరచుకుంటాడు. సామాన్య మానవుని జ్ఞానము దృశ్యజగత్తుకే పరిమితమై వుంటుంది. సూక్ష్మశరీరంలో కుండలినీ జాగృతము కావడముతో మనుష్యునికి అదృశ్యజగత్తుతో పరిచయము కలుగుతుంది. అందులో నివసించే పితరులతో, దేవతలతో స్నేహసంబంధాలు కలిగి, యిచ్చి పుచ్చుకోవటాలు ప్రారంభమవుతాయి. ప్రకృతి రహస్యాలు తెలిసిపోతాయి. భవిష్య సంఘటనలన్నీ అర్థ మౌతాయి. వాటిని తెలిసికొని, తగువిధముగా ప్రణాళిక వేస్కుని అనుకూలత అనే లాభము కలిగి, ప్రతికూలతను నివారించి ముందుకు సాగవచ్చు. ప్రజల మనస్సులలో అనుకూల భావాలను ప్రవేశపెట్టి లోక జీవన ప్రవాహగతి మళ్ళించవచ్చు.

### 2.6.3 కారణశరీరస్థిత కుండలినీ జాగరణ

దీనికి సంబంధించిన మూడు ప్రయోగాలున్నాయి. వాటిని గ్రంథిభేదనము అంటారు. మస్తకము మధ్యలో **బ్రహ్మగ్రంథి** వున్నది. దాన్నే కైలాసపర్వతమని, క్షీరసాగరమని కూడా పిలుస్తారు. దీనిని బ్రహ్మాండీయ శక్తులను యిచ్చిపుచ్చుకోవడముతో కూడిన ధ్రువకేంద్రముగా గుర్తించాలి.

రెండవది హృదయ ప్రదేశములో వున్న **విష్ణుగ్రంథి.** అది చేతనయొక్క అంతరాళము. భావసంవేదనలకు కేంద్రము. తృప్తి, తుష్టి, శాంతి యిక్కడ లభిస్తాయి. తన ఆలోచనలను సమున్నతము చేసుకుని యితరుల ఆలోచనలను మార్చగలిగే శక్తి యీ గ్రంథినుండి లభిస్తుంది.

మూడవది **రుద్రగ్రంథి.** ఇది నాభిచక్రములో వుంటుంది. శారీరక స్వాస్థ్యము, ప్రతిభ, బుద్ధిసూక్ష్మత, సశక్తత, సాహసము, వుత్పాదన, అభివర్ధన మొదలైన అనేక శక్తుల ప్రవాహము యీ క్షేత్రములో లభిస్తుంది. మూలాధారచక్రము దీని గహ్వరములో వున్నది. కుండలినీశక్తి చిరవిశ్రాంతి తీసుకొనే ప్రదేశము యిది. దీనిని ప్రాణప్రహారముతో నిద్రలేపి, బ్రహ్మలోకము వరకు పంపించాలి.

స్థూలశరీరములోని ఆరుచక్రాలు, సూక్ష్మశరీరములోని పంచకోశాలు, కారణశరీరములోని మూడు గ్రంథులు కలిసి 14 అవుతాయి. ఇవే చతుర్దశ భువనాలు. అందులో 7 ఊర్ధ్వలోకాలు, 7 అధోలోకాలు. ఏడు అభ్యుదయానికి, 7 దుష్టదమనానికి, సంకటనివారణకు హేతువులు. మానవశక్తి సముద్రము వంటిది. దానిని త్రివిధ కుండలినీ సాధనలద్వారా మథించాలి. నిజానికి **శరీరాన్ని దైత్యులతో** పోల్చవచ్చు. **మనస్సును దేవతలతో** పోల్చవచ్చు. రెండూ కలిసి తప, యోగముల శాఖ- ప్రశాఖలను అవలంబనము చేసుకుని సాధనలో నిమగ్నులైతే, పైనచెప్పిన 14 రత్నాలను హస్తగతము చేసుకోవచ్చు. పురాణాలలోని సముద్రమంథనము కథ దీని ఆలంకారిక వర్ణన. పంచతత్త్వములు, పంచప్రాణాలు కలసిన కళేబరమునే చాల లోతైన విశాలమైన సముద్రముగా చెప్పు కోవచ్చు. అభీష్టసిద్ధి కొరకు మనము బయటకుపోయి వెదుక్కోవల్సిన అవసరము లేదు.

అన్నీ లోపలే దొరుకుతాయి. కస్తూరిమృగమువలె తన బొడ్డులో వున్న కస్తూరిని గ్రహించలేక యిటునటు పరుగులు పెట్ట నవసరము లేదు. కుండలినీవిజ్ఞానాన్నిగురించి యింతవరకూ సంక్షిప్తముగా వివరించబడినది. కానీ అందులో చెప్పబడ్డ 14 భువనాల విధివిధానాలుగురించి ఎమీ చెప్పబడలేదు. ఎందుకంటే అది అణువిస్ఫోటము వంటిది. ఎట్టి స్థితిలోవున్న, యెటువంటి వ్యక్తి, యే ప్రయోజనముకొరకు, యీ సాధన చేస్తున్నాడో పూర్తిగా తెలియకుండా, సాధనా రహస్యములను చెప్పకూడదు. అందువల్ల యితరులకు హాని కలగడముతోపాటు తనకుకూడా హాని కలుగుతుంది. సామాన్యులకు, క్రొత్తగా నేర్చుకునేవారికి, సావధానత (జాగ్రత్త) లేనివారికి జ్ఞానయోగము, భక్తియోగము, కర్మయోగము, ప్రజ్ఞాయోగము మొదలైన సరళమైన జీవనసాధనలు చాలు. వారు అది చేయగలగడమే గొప్ప విశేషము.

## 2.7 ప్రాణాలిచ్చైనా సరే సద్గురువును పొందితే అది చౌకబేరమే

సద్గురు మహిమను శాస్త్రాలు నిరంతరము కీర్తిస్తాయి. మనీషులు అందరూ ఆత్మిక ప్రగతికొరకు గురువుయొక్క సహాయ మనివార్యమని చెబుతున్నారు. గురువు లేకుండా ఆత్మకళ్యాణ ద్వారాలు తెరుచుకోవు. సాధన ఫలించదు.

ఏ సద్గురువు యొక్క మహాత్మ్యమును శాస్త్రాలు వర్ణించినాయో; నిజానికది సాధకుని అంతఃకరణయే. నిరంతర క్రమశిక్షణ మరియు ఊర్ధ్వగమన ప్రకాశము దీనివల్లనే సంభవము.

అంతఃకరణ నుండి వచ్చే పిలుపును, సందేశమును, మార్గదర్శనమును వినకపోవుటవలన దాని సామర్థ్యము తగ్గిపోయినది. దాని నిర్దేశానుసారము జీవిస్తే సాధకుడు యెట్టి పరిస్థితులలోను మార్గచ్యుతుడు కాడు. అంతఃకరణయొక్క యీ సామర్థ్యమే సద్గురువు. దీనికి నమస్కరించుట, దీనిని పూజించుట, పరిపోషణ చేయుటయే గురుభక్తియొక్క యదార్థ స్వరూపము.

విశేషమైన ప్రేరణ నిచ్చే శరీరధారియైన గురువును యెన్నుకోవడము ఎంతో అవసరము. కానీ భౌతిక గురువుయొక్క పని అంతఃకరణములో వున్న సద్గురువును పరిచయము చేసి, తన శిష్యునిని ఆ సద్గురుని ఉపాసకుడిగా, భక్తునిగా మార్చడమే.

విద్యార్థి యెంత శ్రమపడినా, వుపాధ్యాయుడి జ్ఞానదానము లేకుండా వున్నత శిక్షణ ఫలించదు. అలాగే సమర్థగురువుయొక్క శక్తిపాతము లేకుండా సాధకుని దీక్ష ఫలించదు.

తల్లిదండ్రులు తమ సంతానముయొక్క పాలన– పోషణ చేస్తారు. ఆధ్యాత్మిక మార్గములో జరిగే ప్రక్రియ, ప్రగతికూడా ఈవిధమైనదే. గురువు శిష్యునకు తన సంచిత తపశ్శక్తినుండి ఒక అంశనిచ్చి సమర్థునిగా చేస్తాడు. శిష్యుడు దానిని తనవద్దే దాచుకొనక యీ పరంపరాగత శక్తిని తన శిష్యుల కిచ్చి కొనసాగిస్తాడు.

శ్రీరామకృష్ణపరమహంస అంతటివాళ్ళమవ్వాలి అంటే జన్మజన్మాంతరాల కఠోర సాధన అవసరము. కానీ వివేకానందుడగుట చాల సరళము. సమర్థగురు రామదాసగుటకు చాల శ్రమపడాలి. అది అసిధారావ్రతము లాంటిది. కానీ ఒక సామాన్య బాలుడు ఛత్రపతి శివాజీగా పరిణతి చెందుట చాలా సులభము. పరశువేదిగా రూపాంతరణ చెందుట చాలా కష్టము. కానీ యినుము దానిని స్పృశించిన వెంటనే బంగారముగా మారటము చాలా సులభము. చాణక్యుడు లాంటి అగ్నితత్త్వప్రధాన వ్యక్తిత్వము చాలా అరుదు. కానీ అతని సంపర్కముతో ఒక దాసీపుత్రుడు సామ్రాట్టుగా మారుట సహజము. బుద్ధుడు లాంటి ప్రతిభలు యెప్పుడో ఈశ్వరేచ్ఛవలన

అవతరిస్తాయి. కానీ ఆయన నీడలో అశోకుడు, ఆనందుడు, ఆమ్రపాలి, అంగుళీమాలుడు మొదలగు అనేకమంది వ్యక్తులు తమ లఘుతను అధిగమించి, మహత్తును వరించగలిగారు. గాంధీలాంటి మహాత్ములు యెప్పుడో జన్మిస్తారు. ఆయనను అనుసరించేవారు, రాష్ట్రపతులు, ప్రధానమంత్రులు, లోక నాయకులు చరిత్రలో మహాపురుషులుగా కీర్తించబడుతున్నారు. ఈవిధమైన 'శక్తిపాత' సంఘటనలు వివేకానంద, పరమహంస యోగానందుల జీవితాలలో కనిపిస్తాయి. శ్రీమాతా, అరవిందుల రచనలలో ఇటువంటి వర్ణనలు వున్నాయి.

గురుశిష్య పరంపరలో శక్తిపాతముయొక్క యదార్థతను అనుమానించవలసిన పనిలేదు. గురువుయొక్క అనుదానాలవలన సామాన్యులు అసాధారణ మహాపురుషులుగా పరిణతి చెందిన యదార్థసంఘటనలు చరిత్రలో అనేకమున్నాయి. సాధనామార్గంలోని అవరోధాలను తొలగించుటలో గురువుయొక్క పాత్ర అసాధారణమైనది.

గురువుయొక్క శక్తిపాతము శిష్యుని ఆంతరిక శ్రద్ధయొక్క ప్రతిస్పందన. శిష్యునిలో ఆదర్శముల పట్ల యెంత యెక్కువ నిష్ఠ వుంటుందో అంత గురుఅనుగ్రహము లభిస్తుంది. శ్రద్ధ శిష్యుని పెట్టుబడి. గురువు అనుగ్రహము దానివలన వచ్చిన లాభము. తద్వారా శిష్యుని సామర్థ్యము పెరుగుతుంది, వ్యక్తిత్వము వికసిస్తుంది. ఇది ఒక సమయసాధ్య మరియు సాధనాసాధ్యమైన ప్రక్రియ. శ్రద్ధాపూరిత సాధనద్వారా సాధకుడు గురువునుండి శక్తిపాతము పొందుతాడు. ఇది ఒక ఆకస్మిక చమత్కారము కాదు. ఒక దీర్ఘకాలీన సాధన ఫలితము.

శిష్యుడు సమిత్పాణియై గురువు దగ్గరికి వెళ్ళాలి అని ఉపనిషత్తులలో చెప్పబడి వున్నది. సమిధ యెందుకు? సమిధ, అగ్ని సంపర్కముతో అగ్ని వలె మారుతుంది. గురువు జ్ఞానాగ్నియొక్క ప్రాణమున్న ప్రతిమ. సాధకుడు సమిధవలె పాత్రతనుబట్టి ఫలితమును పొందుతాడు. తడిగా వున్న సమిధ పొగను మాత్రమే యిస్తుంది. జనార్దనుని శిష్యుడు ఏకనాథుడు, గహనీనాథుని శిష్యుడు నివృత్తినాథుడు, నివృత్తినాథుని శిష్యుడు జ్ఞానేశ్వరుడు, స్వామి నిగమానందుని శిష్యుడు యోగి అనివార్యుడు, గోవిందపాదుని శిష్యుడు శంకరాచార్యులు, శంకరానందుల శిష్యుడు విద్యారణ్యుడు, కాలూరామ్ శిష్యుడు కీనారామ్, భగీరథస్వామి శిష్యుడు త్రైలింగస్వామి, ఈశ్వరపురీ శిష్యుడు చైతన్యమహాప్రభు, పూర్ణానందశిష్యుడు విరజానంద, విరజానంద శిష్యుడు దయానంద, శ్రీరామకృష్ణ పరమహంస శిష్యుడు వివేకానంద, ఆయన శిష్యురాలు నివేదిత, ప్రాణనాథ మహాప్రభు శిష్యుడు ఛత్రసాలుడు, సమర్థరామదాసు శిష్యుడు శివాజీ, చాణుక్యుని శిష్యుడు చంద్రగుప్తుడు, కబీరు శిష్యుడు రైదాసు, దాదూ శిష్యుడు రజ్జత్, విశుద్ధానంద శిష్యుడు గోపీనాథ్ కవిరాజ్, పతంజలి శిష్యుడు పుష్యమిత్రుడు, బంధుదత్తుని శిష్యుడు కుమారజీవుడు మొదలగు వారినిగురించి దేవసంస్కృతి చరిత్రలో తెలిసికొనవచ్చును.

వారి జీవితాలలో గురువుపట్ల వారికున్న సమర్పణాభావము, తాదాత్మ్యతాభావము అద్భుతము. శ్రేష్ఠగురువుకు సమర్పణ అన్నింటికంటే శ్రేష్ఠమైనది. ఎందువల్లనంటే వ్యక్తి తద్వారా నిరాకారబ్రహ్మనేకాక తనలోని భగవంతునికే కాక, విశాల విరాట్ విశ్వపరమాత్మ చేతనకుకూడా సమర్పణ చేసుకుంటాడు.

## 2.8 గురువుయొక్క పాత్ర

సారవంతమైన భూమికూడా ఎరువు, నీరు, విత్తనము బయటనుండి లభిస్తేనే పంటపండుతుంది. గురువుకూడా విత్తనము, నీరు, ఎరువు లభింపజేస్తేనే శిష్యుని మనోభూమి వికసిస్తుంది. తోటమాలి తన తోటను పుష్పింపించి వికసించడానికి యెటువంటి చర్యలు, బాధ్యతలు చేపట్టాలో, కర్తవ్యనిష్ఠ గురువు తన శిష్యునిపట్ల అలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి. నేడు గురు- శిష్య పరంపర ఒక చిహ్నపూజగా మాత్రమే

వున్నది. పాత్రత లేకపోవుటవల్ల గురు- శిష్య సంబంధాలు వ్యర్థమని అనిపిస్తున్నాయి.

ప్రాణవంతుడైన, ఆత్మశక్తిగల గురువు సాన్నిధ్యములో, అనుకూల వాతావరణములో పొందగలిగే అనుగ్రహము శిష్యుడు వేరొకచోటవుండి అస్తవ్యస్థస్థితిలో, యెన్ని సాధనలు చేసినా, యెంత అధ్యయనము చేసినా పొందలేడు.

గురుశిష్య సంబంధము శారీరికమైనది కాదు. ఆత్మకు సంబంధించినది. సాధకుని జీవాత్మ, గురువుయొక్క ఆత్మతో సంబంధము కలిగివుంటుంది. అందువలన గురువు శరీరాన్ని త్యజించినా, యే విధమైన అవరోధాలు లేకుండా ఆయననుండి ప్రేరణ నిరంతరము లభిస్తూనే వుంటుంది.

భౌతిక లాభాల కొరకే కాక ఆధ్యాత్మిక మార్గములో ముందుకు వెళ్ళాలి అనే సాధకులకుకూడా అనుభవజ్ఞుడైన మార్గదర్శకుడు చాల అవసరము. అర్హతలేని వ్యక్తి గురుస్థానములో వుంటే తనతోపాటు శిష్యుడినికూడా ముంచుతాడు. అందువల్ల ఆత్మపథపథికుడు శ్రద్ధాళువేకాక, సతర్కుడై జాగరూకతను కలిగివుండాలి. లేకపోతే ఈ కలియుగములో వున్నదికూడా పోగొట్టుకుంటాడు.

నాకు (శ్రీరామశర్మ ఆచార్య) 15 సంవత్సరాల వయస్సులో ఒక సమర్థ సిద్ధపురుషుడి (దాదాగురుదేవుల) అనుగ్రహము లభించింది. నా గురుదేవులతో సంబంధము అనేక జన్మల్నుండీ అవిచ్ఛిన్నముగా, నిర్విరామముగా కొనసాగుతున్నది. భవిష్యత్తులోకూడా యిలాగే కొనసాగుతుంది. చపలచిత్తులు అడుగడుగునా దారి మార్చు కుంటారు. ఒకసారి ఒక గురువును, యింకొకసారి ఇంకొక గురువును పట్టుకుంటూ వుంటారు. స్థిరచిత్తము గలవారు చాల ఆలోచించి ఒక మార్గాన్ని నిర్ణయించుకుంటారు. దానిని చివరివరకు వదలరు. నాలో బీజ రూపములో వున్న గహనశ్రద్ధను మరియు చలించని కర్మఠతను పసిగట్టి వాటిని వికసింపజేయుటకు తమ సంపూర్ణ సామర్థ్యమును నా గురుదేవులు (నేను భరించగలిగేటంత) వినియోగించారు. సమర్థుడైన మార్గదర్శకుని అనుగ్రహము చాల విలువైనదే; కానీ జన్మజన్మాంతరములనుండీ పాత్రతను పెంచుకుంటున్న వ్యక్తికూడా ప్రశంసనీయుడే.

**భౌతిక లాభాలు, స్వసుఖాపేక్ష లేకుండా ఆత్మకళ్యాణమును వాంఛించేవారే సత్పాత్రులు.**

అంతఃకరణమును నిర్మలముగా వుంచుకొని, కోరికలు లేకుండా, వుత్కృష్టతలను ఆశించేవారే సత్పాత్రులు. లోకేషణ, విత్తేషణ, పుత్రేషణల నుండి విముఖులై విశ్వమానవుని శ్రేయస్సుకు సమర్పితులైనవారు మహాపాత్రులు. ఇటువంటి మహాపాత్రులకు దేవసత్తాలు కూడా తమని తాము అర్పించుకుంటాయి.

మనిషి అల్పజ్ఞత అన్ని క్షేత్రాలలోను ఒకేలాగా విస్తరించివుంటుంది. వ్యక్తుల స్థాయిని గుర్తించడములో కూడా యీ అల్పజ్ఞత అనేక రకాలుగా అడ్డుతగులుతుంది. ఆత్మబలసంపన్నులైన సంతులు, మహాత్ములు, జ్ఞానులు, తత్త్వదర్శనము చేసినవారు అన్నికాలాలలోనూ వుంటారు. కానీ వారి స్థాయిని గుర్తించలేకపోవుట వలన వారి సమకాలీనులు వారినుండి వుచ్చస్థాయి లాభాలు పొందలేకపోతున్నారు.

రాముడిని, కృష్ణుడిని ఆకాలమువారు గుర్తించి వుంటే వారితో అలా ప్రవర్తించేవారుకారు. సీత మీద అపవాదు వేసిన చాకలికి ఆమె మహాశక్తి అని తెలియదు. శిశుపాలునకు కృష్ణుడిని గురించి అవగాహన లేకపోవటమువలన అన్ని కటువచనాలు పలికాడు. స్వల్ప ధనముకోసము ఏసుక్రీస్తును అప్పగించెడివారు కారు. వాల్మీకి నారదుని గుర్తించివుంటే అలా ప్రవర్తించివుండేవాడుకాదు. హిమవంతుని భార్య తన కూతురు

సాధారణ కన్య కాదు అని తెలిసివుంటే తపస్సు చేయవద్దని అడ్డుపెట్టివుండేది కాదు. తన యింటి ముందుకు వరునిగా వచ్చిన శివుని చూసి యెందుకు దుఃఖిస్తుంది? అశోకవాటికలో హనుమంతుణ్ణి సాధారణ కోతి అని అనుకోవడము వలననే రాక్షసులు బంధించారు. చాణుక్యుని ప్రచండశక్తిని నందుడు గుర్తించి వుంటే చిన్న విషయాల మీద అతనిని అవమానించి తన వంశమును, రాజ్యమును యెందుకు సర్వనాశనము చేసుకునేవాడు? నేటి పరిస్థితులలో సద్గురువుని యెలా గుర్తించాలి?

ఈ సమస్యకు ఒకే ఒక పరిష్కార మార్గము వున్నది. అది అన్వేషణాత్మక బుద్ధి, వైజ్ఞానిక దృష్టికోణమును పెంచుకొనుట. వీటివలన ప్రకృతి రహస్యాలను తెలుసుకున్నట్లే సద్గురువుని గుర్తించి ఆయన అనుగ్రహమును పొందవచ్చు.

గురు మహిమను కబీరు యిలా తెలిపారు.

**సబ్ ధరతీ కాగద్ కరూం లేఖనీ సబ్ వన్ రామ్ ।**

**సాత్ సముద్ కో మసి కరూం గురు గున్ లిఖా న జాయ్ ॥**

పృథ్విని కాగితముగా, చెట్లను కలముగా, ఏడు సముద్రాలను సిరాగా మార్చి వ్రాసినా గురుమహిమను తెలుపలేము.

**గురుకుమ్హార్, శిష్యకుంభ్ హై, గఢి గఢి ఖాడే ఖోత్ ।**

**అంతర్ హథ్ సహర్ దే, బాహర్ బాహే ఛోట్ ॥**

కుమ్మరి ఎలాగ కుండలకు అందమైన ఆకృతిని ఇస్తాడో గురువుకూడా అలాగే ఒక చేతితో సహాయము చేస్తూ బయటి నుండి దెబ్బలు వేసి శిష్యుడిని సవరిస్తాడు.

ఒక మహాత్ముడు యిలా అన్నాడు.

**యహ తను విషకి కోఠరి, గురు అమృత్ కీ ఖాన్ ।**

**సీస్ దియే తో గురు మిలే తో భీ సస్తా జాన్ ॥**

శరీరము విషపూరితమైన లత, గురువు అమృతఖని, శిరస్సు ఇచ్చి గురువును పొందినా అది చాలా చౌకే!

**గురుగోవింద దోవూ ఖడే, కాకే లాగూ పాయ్ ।**

**బలిహారి గురు ఆపనౌ గోవింద దియో బతాయ్ ॥**

గోవిందుడి కంటే ముందు గురువుకు పాదనమస్కారము చెయ్యాలి. ఎందుకంటే గురువు వలననే గోవిందుని గుర్తించాము.

గురుగీతలో యిలా చెప్పబడింది.

**గురుర్బ్రహ్మా గురుర్విష్ణుర్గురుర్దేవో మహేశ్వరః ।**

**గురుస్సాక్షాత్ పరబ్రహ్మా తస్మై శ్రీగురవేనమః ॥**

గురువే బ్రహ్మా, గురువే విష్ణువు, గురువే మహేశ్వరుడు. గురుస్సాక్షాత్ పరబ్రహ్మా – పరబ్రహ్మా అయిన అలాంటి గురువుకు; తస్మై శ్రీగురవేనమః – నమస్కారము.

గురుదీక్ష అనగా ప్రాణప్రత్యావర్తన. గురు అనుదానాలను పొందడానికి శిష్యుడు తదనురూపమైన కర్తవ్యములను పాటించాలి. ఎంత వుదారముగా గురుదీక్ష యివ్వబడుతుందో అంత వుదారముగానూ గురుదక్షిణ యివ్వాలి. గురుదక్షిణ గురుఅనుదానాలకి శిష్యుని ప్రతిస్పందన. బీజారోపణ గురుదీక్ష అయితే దానికి ఎరువు,

నీరు పోసి పెంచుట గురుదక్షిణ.

గురువు సామర్థ్యము - శిష్యుని పాత్రత; గురువు యొక్క సిద్ధి - శిష్యుని సాధన; గురువు ప్రేరణ - శిష్యుని సక్రియత; గురువు స్నేహము - శిష్యుని శ్రద్ధ; గురువు అనుశాసనము - శిష్యుని అనుగమనము యిలా గురుశిష్యులు పరస్పర సహాయ-సహకారములు అందించుకుంటూ వుంటారు.

## 2.9 శక్తిపాతముయొక్క క్రమిక పద్ధతి

ఒక్క క్షణములో తన మొత్తము శక్తిని శిష్యునకిచ్చివేసే సర్వమేధయజ్ఞస్థాయి 'శక్తిపాతము' చాలా అరుదు. అటువంటి విశేష సామర్థ్యముగల గురువులు వున్నా దానిని భరించి వుపయోగించుకొనగలిగే సత్పాత్రులైన శిష్యులూ నేడు లేరు. ఇటువంటి సౌభాగ్యపూర్ణ అద్భుత అనుగ్రహము చాల అరుదు.

క్రమిక శక్తిపాతము పొందగలగడము, ప్రయత్నించి నిలకడగా వుండగలిగేవారికి అంత కష్టముకాదు. గురు-శిష్యుల మధ్య ఆత్మీయత, శ్రద్ధా భావనలు వుండి, శిష్యుడు నిరంతర సాధనా నిరతుడై వుంటే గురువు శక్తి, ఒక నియత గతితో శిష్యునిలో ప్రాణసంచారము చేయగలుగుతుంది.

ప్రాణసంచారముకొఱకు గురు-శిష్యులు దగ్గరే వుండనవసరములేదు. దూరముగావున్నా, శరీరము లేకపోయినా, సద్గురువు శిష్యుని పాత్రతనుబట్టి ప్రాణసంపదను అందిస్తాడు. తాబేలు తన గ్రుడ్డును ఇసుకలో దాచి, సముద్రములో యెంతో దూరముగా వున్నా తన సంకల్పశక్తిద్వారా దానిని పొదుగుతుంది. ఒకవేళ అది చనిపోతే దాని గ్రుడ్డుకూడా కుళ్ళిపోతుంది. ఆధ్యాత్మికజగత్తులో ప్రాణవంతుడైన సద్గురువు మృత్యువుకు అతీతుడు కనుక దేశకాలాతీత స్థితినుంచి శిష్యుని పాత్రతనుబట్టి ప్రాణశక్తి నిరంతరము అందజేస్తాడు.

శిష్యుని కోరిక కాదు, గురువు తను బాధ్యతను స్వీకరిస్తాను అన్నప్పుడే, ప్రాణసంచారము, శక్తిపాతము (రెండు పదాలలోవున్న విశిష్ఠ భావాన్ని అర్థము చేసికోండి) సంభవమౌతుంది.

**శ్రీశిరిడిసాయి ప్రాణసంచారము చేసే సద్గురువు**

కుండలినీ జాగరణ ప్రక్రియకు నేను బాధ్యతవహిస్తాను అన్న సద్గురువు శ్రీరామశర్మఆచార్య.

సద్గురువు ద్వారా శక్తిపాతము, తద్వారా కుండలినీజాగరణ జరిగినప్పుడు వివేకానంద, శివాజి, చంద్రగుప్తుడు, మొదలగువారివలె గురువులయొక్క మహత్తర ప్రణాళికలో పాలుపంచుకోగలుగుతారు. ప్రతి గురువు శిష్యుని పాత్రత బట్టి అనుగ్రహము యివ్వగలిగినా 'గురు-సత్తాగా' నేడున్న గురుసాంప్రదాయములలో కొంతమంది ప్రణాళికలు 18,19పుటలలో వివరింపబడినవి. ఒకటిమాత్రము గుర్తుంచుకోండి. మీకు నచ్చిన (అనగా మీరు బాగా ఆలోచించుకుని, నిర్ణయము తీసుకున్న తర్వాత యిక ఆగురుచరణాలను వదలకండి). ఏ గురువు ద్వారా అయినా 'శక్తిపాతము' జరుగుతుంది. ఎందుకంటే 'గురుతత్త్వము' ఒకటే. దానిని యే రూపము ద్వారా అయినా మీరు గ్రహించవచ్చు.

ప్రాణసంచారము శిష్యునిలో హార్మోన్ల ప్రేషణ ద్వారా జరుగుతుంది. 'మత్స్యము' ఒక ప్రాణి. అది మన శరీరములో ప్రాణమునకు సంకేతము. మత్స్యావతారము యెలా వృద్ధిచెందినదో అలా క్రమక్రమముగా శరీరములో ప్రాణసంచార హార్మోన్లు వృద్ధిచెందాలి. సాధకునిలో వీటి పెరుగుదల శ్రద్ధ- సబూరి యొక్క పెరుగుదలగా గుర్తించవచ్చు. నేడు శ్రద్ధ- సబూరిల హార్మోన్లు మానవజాతిలో పెరుగుతున్నవి అనే దానికి

నిదర్శనము శ్రీశిరిడిసాయి ఆలయాల పెరుగుదల. సాయి చరిత్ర సాప్తాహిక పారాయణ యెన్నిసార్లు చేస్తే అంత బాగా ప్రాణసంచార ప్రక్రియ జరుగుతుంది. అదేవిధముగా యే గురుచరిత్ర పారాయణ అయినా లేక భాగవత పారాయణ అయినా సాధకునిలో ప్రాణశక్తిని పెంపొందిస్తుంది.

సాధకునిలో శ్రద్ధ, సబూరి పెరగడము ప్రాణసంచారక్రియ. ఈ ప్రాణసంచార క్రియలో అతి ముఖ్యమైన దేమిటంటే సాధకుని దృష్టి నిరంతరము తన గురువుపై వుండటము. శిరిడిసాయి 12 సంవత్సరముల పాటు వేపాకు తింటూ నిరంతరము నా గురువుని చూస్తూండటమే నేను చేసిన సాధన అన్నారు. దీనినిబట్టి మనమూ నిరంతరము సాయివైపు చూడటము, వేపాకు తినడము లాంటి భౌతిక కృత్యములు అనుకరించడము ముఖ్యము కాదు. ఆ వాక్యము అంతరార్థము అర్థము చేసుకోవాలి. ఇంద్రియాల సంపర్కము చేదుగా భావించి, ఆజ్ఞాచక్రము నుండి వచ్చే శ్రద్ధ- సబూరీల హార్మోన్లను నిరంతరము స్వీకరించడమే సాధనా విధానము. దీనిని ప్రాణోత్థాన ప్రక్రియగా తెలుపుతారు. నేడు కుండలినీజాగరణ ప్రక్రియగా చెప్పబడుతున్న విధివిధానాలు, క్రియాయోగాలు, ప్రాణోత్థాన ప్రక్రియలే శరీరములోని వివిధ భాగాలలో పంచప్రాణాలకి మధ్యనున్న సమన్వయమే పంచీకరణము. అదే ప్రాణసంచార ప్రక్రియ.

ప్రాణోత్థాన ప్రక్రియ తర్వాత కుండలినీజాగరణ ప్రక్రియ సాధకునిలో కూర్మావతార అవతరణగా తెల్సుకోవాలి. మస్తిష్కములో యీ కూర్మావతారము, పిట్యూటరీఫోసా (Pitutary Fossa) అనే ఒక లోతైన కన్నముగా (deep depression) వుంటుంది. దీనిలోనే పిట్యూటరీబాడి వుంటుంది. ఇది ఆజ్ఞాచక్రము యొక్క భౌతిక స్వరూపము. దీని ప్రతిబింబమే మూలాధారము వద్దనున్న కూర్మము. ఈ కూర్మము ఆధారముగా కుండలీకృతమై వున్న శక్తి సముద్రమంథన ద్వారా (స = కూడా; ముద్ర = చిత్తములోని సంస్కారములు) జాగృతమవుతుంది.

ప్రాణసంచారము తగిన ప్రాణాయామ విధానముల ద్వారా, కుండలినీజాగరణ చక్రభేదనము ద్వారా జరుగుతుంది. విశుద్ధిచక్రమువరకు వచ్చిన కుండలినీ సాధకునిలో వరాహావతారాన్ని మేల్కొల్పుతుంది. ఈ వరాహావతారము సాధకుని Brainstem.

ఈవిధముగా మస్తిష్కములోని అనేక భాగాల జాగరణే దశావతారాలుగా జరుగుతుంది.

ఈ పుస్తకము మీచేతులలో వుండటమే గురువుల కృపాదృష్టి మీమీద పడినదనటానికి సాక్ష్యము. దీనిని గుర్తించి యీ పుస్తకము నధ్యయనము చేస్తున్నప్పుడు మీకు రకరకాలుగా ‘ గురుపదధ్వనులు ’ వినిపించవచ్చు.